అసెంబ్లీ ఆవాజ్
బడ్జెట్ సమావేశాలు



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వస్తున్న బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరైన బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్. చిత్రంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబిత తదితరులు

# స్థిరమైన వృద్ధి.. సామాజిక న్యాయం

**ఆ దిశగా తెలంగాణ ప్రయాణం • అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగం**

**బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన • షేమ్.. షేమ్ అంటూ నినాదాలు**



హైదరాబాద్, మార్చి 12(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం స్థిరమైన వృద్ధి, సామాజిక న్యాయం కోసం పునాదులను పటిష్టపర్చడంతోపాటు పరిమితి లేని అవకాశాలు గల భవిష్యత్తు దిశగా తెలంగాణ ప్రయాణాన్ని వేగవంతం చేస్తున్నదని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసాను రూ.12 వేలకు పెంచడమే కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు ఏడాదికి రూ.12వేల చొప్పున సమకూర్చుతున్నట్టు తెలిపారు.. బుధవారం రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ఏడాది కాలంలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రభుత్వ ప్రాథమ్యాలను వివరించారు. రైతుల సాధికారత ప్రభుత్వ నైతిక కర్తవ్యమని, 260 టన్నుల ఉత్పత్తి రికార్డుతో దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తిదారుగా తెలంగాణ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. 25.35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చేలా రూ.20,616.89 కోట్లతో రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేసినట్టు చెప్పారు. సన్నరకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చొప్పున రూ.1,206.44 కోట్లు విడుదల చేశామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 149.63 కోట్ల ఉచిత బస్సు ట్రిప్పులను కల్పిస్తూ వారికి రూ.5,005.95 కోట్లు ఆదా చేశామని వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్టు పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు

బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభకు హాజరై గవర్నర్ ప్రసంగాన్ని ఆలకించారు. మధ్యమధ్యలో బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేస్తుండగా ఆయన చేయి పైకెత్తి వారిని వారించే ప్రయత్నం చేశారు. కాగా, గవర్నర్ ప్రసంగంపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ పెద్దఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను తమ ప్రభుత్వం సాధించినట్టుగా గవర్నర్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పించడంపై బీఆర్ఎస్ సభ్యులు మండిపడ్డారు. ప్రసంగంలో అన్నీ అబద్ధాలు ఉన్నాయని ఆరోపించారు. షేమ్.. షేమ్ అంటూ నినాదాలు చేశారు. సంపూర్ణ రుణమాఫీ చేయాలని, పంట బోనస్ ఇవ్వాలని నినాదాలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన మధ్యే గవర్నర్ ప్రసంగం కొనసాగింది.

## గవర్నర్ ప్రసంగంలో పచ్చి అబద్ధాలు: బీజేపీ

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): గవర్నర్ ప్రసంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్పిందని బీజేపీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తంచేశారు. హామీలను నెరవేర్చినట్టు గొప్పలు చెప్తున్న ప్రభుత్వాన్ని గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చర్చ సందర్భంగా నిలదీస్తామని స్పష్టంచేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం ఎంతమందికి కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, నిరుద్యోగ భృతి, రైతు భరోసా ఇచ్చారో లెక్కచెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ ఏక కాలంలో చేసినట్టు అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. ఏ మహిళకు ప్రభుత్వం ద్వారా రూ.కోటి వచ్చాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.

## వాస్తవాలకు భిన్నంగా గవర్నర్ ప్రసంగం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు భిన్నంగా, ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగించే విధంగా ఉన్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో భాగమైన మహిళలకు రూ.2,500, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, దళిత కుటుంబానికి రూ.12 లక్షలు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఈ సంవత్సరం కూడా అమలు కాని పరిస్థితి కనబడుతున్నదని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగంలో రెండు లక్షల ఉద్యోగాల ప్రస్తావన లేదని దుయ్యబట్టారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ పూర్తికాలేదని, విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై స్పష్టత లేదని విమర్శించారు. రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్‌సిటీ పేరుతో మాయాజాలాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు.

# అసెంబ్లీలో అందరి దృష్టి కేసీఆర్‌పైనే

**సభ లోపల, బయట ఒకటే చర్చ • ఎదురేగి స్వాగతించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యులు • కేసీఆర్‌ను కలిసిన తుమ్మల, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగంలోని అంశాల కన్నా, అసెంబ్లీ లోపల, బయట, ఎవరినోట విన్నా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పైనే చర్చ. 'సార్ మీటింగ్‌కు వచ్చిండా?, కేసీఆర్ వచ్చారా? సీఎం కంటే ముందే కేసీఆర్ సభకు వచ్చినట్టున్నరు! ఇలా అసెంబ్లీ ప్రాంగణంలో ఏ ఇద్దరు కలిసినా, చివరికి ఒకరిద్దరు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కలిసినా ఇదే ముచ్చట. ఈ బడ్జెట్ సమావేశాల ప్రారంభ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం నిర్దేశిత సమయానికన్నా 40 నిమిషాల ముందే అసెంబ్లీకి చేరుకున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో హాజరయ్యేందుకు కేసీఆర్ వస్తున్నారనే విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సభ్యులు ఎదురేగి స్వాగతం పలికారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, కోవా లక్ష్మి సహా పలువురు శాసనసభ, మండలి సభ్యులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అసెంబ్లీ ప్రవేశద్వారం నుంచి కేసీఆర్ లోపలికి చేరుకొని నేరుగా ప్రతిపక్ష నేత చాంబర్‌లో కూర్చున్నారు.

### కేసీఆర్‌ను కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

కేసీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, జారే ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీకి కేసీఆర్ వచ్చారని తెలుసుకున్న గూడెం మహిపాల్‌రెడ్డి వెళ్లి తన తమ్ముడి కుమారుడి వివాహ పత్రికను అందజేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన మహిపాల్‌రెడ్డి కేసీఆర్‌ను కలవడం చర్చనీయాంశమైంది. సభ ప్రారంభ నిర్దేశ సమయానికి ముందే కేసీఆర్ సహా బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీ సమావేశ మందిరానికి వెళ్లారు. అసెంబ్లీలో కేసీఆర్ వద్దకు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్వయంగా వచ్చి పలకరించి వెళ్లారు. కేసీఆర్ సభకు వచ్చారనే విషయాన్ని తెలుసుకున్న ఒక మంత్రి 'మా కన్నా ముందే కేసీఆర్ వచ్చిండా?' అని ఆశ్చర్యానికి గురయ్యారు. కాంగ్రెస్, బీజేపీ సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఇలా అందరి కందరూ గవర్నర్ ప్రసంగం కన్నా కేసీఆర్ గురించే ముచ్చటించుకోవడం విశేషం.

# గవర్నర్ ప్రసంగమా? గాంధీభవన్ ప్రెస్‌మీటా?

**420 హామీలపై కొత్త ముచ్చటే లేదు • 15 నెలల అట్టర్‌ఫ్లాప్ పరిపాలనపై ప్రాయశ్చిత్తం ఉంటుందని భావించాం**

- గవర్నర్ నోట అర్ధసత్యాలు, అసత్యాలు
- గవర్నర్ స్థాయిని ప్రభుత్వం దిగజార్చింది
- కమీషన్ల యావ తప్ప.. విజన్ లేదు
- సచివాలయంలోని కాంగ్రెస్ తల్లి, బయటి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మూడేండ్ల తర్వాత ప్యాక్ చేసి గాంధీభవన్‌కు పంపుతాం
- గవర్నర్ ప్రసంగం పెండ్లిలో చావుడప్పు కొట్టినట్టుగా ఉన్నది
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ విమర్శలు



శాసనసభ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్, మాణిక్‌రావు, బండారు లక్ష్మారెడ్డి, విజయుడు, అనిల్‌జాదవ్

> గవర్నర్ ప్రసంగంలోని ప్రతి వాక్యం పచ్చి అబద్ధం. మోసం. ఇది గవర్నర్‌ను కూడా మోసం చేయడమే. మొత్తంగా గవర్నర్ ప్రసంగం పెండ్లిలో చావు డప్పు కొట్టినట్టు ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వానికి కమీషన్ తప్ప ఎలాంటి విజన్ లేదు.
> -కేటీఆర్

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్ వలే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెప్తారేమోనని భావించామని, కానీ గవర్నర్ నోటితో అన్ని అబద్ధాలే చెప్పించారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 480 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలకు భరోసా ఇచ్చే ఒక్కమాట కూడా గవర్నర్ నోటి నుంచి రాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కమీషన్ల యావ తప్ప ఎలాంటి విజన్ లేదని మండిపడ్డారు. సెక్రటేరియట్‌లో కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని, సెక్రటేరియట్ ముందు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టారని, మూడేండ్ల తర్వాత తామే అధికారంలోకి వస్తామని, ప్యాక్ చేసి ఆ విగ్రహాలను గాంధీభవన్‌కు పంపుతామని స్పష్టంచేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే గవర్నర్ ప్రసంగం పెండ్లిలో చావుడప్పు కొట్టినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. మంగళవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ జిష్ణుదేశ్‌వర్మ ప్రసంగం ముగిసిన అనంతరం.. శాసనసభ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, బక్క జడ్సన్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, డాక్టర్ సంజయ్ కుమార్, ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డితో కలిసి కేటీఆర్ మాట్లాడారు. '15 నెలల పేలవమైన, అట్టర్‌ఫ్లాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకొనేలా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగంలా లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే గాం ధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉన్నది. గవర్నర్ నోటితో అర్ధసత్యాలు, అసత్యాలు పలికించారు. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం ఆందోళనలో ఉన్నది. రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నయ్. ఇప్పటికే 480 పైచిలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులకు సాంత్వన చేకూర్చే, ఉపశమనం కలిపించే, భరోసా ఇచ్చే మాట గవర్నర్ నోటినుంచి వస్తుందేమోనని ఆశించాం. వారి నోటివెంట ఒక్కమాట కూడా రాలేదు' అని కేటీఆర్ మండిపడ్డారు.

### కమీషన్ యావ తప్ప.. విజన్ లేదు

కాంగ్రెస్ ప్రభుత్వానికి కమీషన్ తప్ప ఎలాంటి విజన్ లేదని కేటీఆర్ విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించడానికి సచివాలయంలో 20% కమీషన్లు తీసుకుంటున్నారని ఇటీవలే చిన్న కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎం భట్టి చాంబర్ ఎదుట ధర్నా చేశారని చెప్పారు. కుంభకోణాలు, 30% లాండ్ డీలింగ్స్, కాంట్రాక్టర్ల నుంచి 20% కమీషన్లు తీసుకుంటూ పదవులు కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని విమర్శించారు. 30% కమీషన్ ఇస్తేనే మంత్రులు పని చేస్తున్నారని స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తున్నారని మండిపడ్డారు. ఒక్క గ్యారెంటీ, 420 హామీల్లో ఒక్క హామీనీ అమలుచేయకుండా రూ.లక్ష 62 వేల కోట్ల అప్పులు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తొమ్మిదిన్నరేండ్లలో రూ.4.17 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ ప్రభుత్వంపై ఎగిసిపడ్డ కాంగ్రెస్ నేతలు.. ఒకే సంవత్సరంలో రూ.లక్ష 62 వేల కోట్ల అప్పు చేసి ఒక్క కొత్త పథకాన్ని కూడా అమలుచేయలేదని, ప్రాజెక్టుల్లో ఒక్క ఇటుక పేర్చలేదని మండిపడ్డారు.

### 25-30 శాతానికి మించి రుణమాఫీ కాలేదు

'అసలు ఈరోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలోనూ 25 నుంచి 30 శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై గత శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ, మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటివెంట రుణమాఫీ అయిపోయిందని, లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నారని అబద్ధాలు చెప్పించి.. గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకున్నది' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

### ఎండిపోతున్న గోదావరి పరీవాహకం

రేవంత్‌రెడ్డి చేతగానితనం వల్ల రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. 'రైతుబంధు మొత్తం అందింది.. అది మాత్రమే కాకుండా రైతు కూలీలకు రూ.12,000 సహాయం చేస్తున్నామని గవర్నర్ నోట అబద్ధాలు చెప్పించడమంటే గవర్నర్‌కు కూడా అవమానం. గవర్నర్ దీనిని గుర్తించాలి. సాగునీటి సంక్షోభం రోజురోజుకు తీవ్రమవుతున్నది. కేసీఆర్‌పై ద్వేషంతో, బీఆర్ఎస్‌పై గుడ్డి కోపంతో మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా 15 నెలలు ఎండపెట్టడం వల్ల గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎండిపోతున్న ప్రతి ఎకరా పంటకు బాధ్యత తీసుకోవాల్సింది రేవంత్‌రెడ్డి అనే ఈ ముఖ్యమంత్రి. కానీ, ఆయన చేతగానితనం వల్ల రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయి. పంట ఎండిపోయి రైతులు అవస్థలు పడుతూ, ఆగ్రహంతో పంటలకు నిప్పుపెట్టుకుంటున్నరు. పొలాల్లో గొర్రెలు, మేకలను మేపుతున్న రైతులు.. గవర్నర్ ప్రసంగం నుంచి ఒక్కమాట కోసం ఇవాళ ఎదురుచూశారు. కానీ, అది లేదు.' అని కేటీఆర్ ఫైరయ్యారు.

> సాగునీటి సంక్షోభం రోజురోజుకు తీవ్రమవుతున్నది. కేసీఆర్‌పై ద్వేషంతో, బీఆర్ఎస్‌పై గుడ్డి కోపంతో మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా 15 నెలలు ఎండపెట్టడం వల్ల గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎండిపోతున్న ప్రతి ఎకరా పంటకు బాధ్యత తీసుకోవాల్సింది రేవంత్‌రెడ్డి అనే ఈ ముఖ్యమంత్రే.
> -కేటీఆర్

### ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తరా?

దావోస్ నుంచి గతంలో చేసుకున్న ఒప్పందాలకు సంబంధించి శ్వేతపత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. స్వచ్ఛ బయో కంపెనీ పెట్టి రేవంత్‌రెడ్డి సోదరుడు పెట్టుబడి పెడుతున్నారని మండిపడ్డారు. కేన్స్ గుజరాత్‌కు, కార్నింగ్ తమిళనాడుకు, ప్రీమియర్ కంపెనీలు ఏపీకి తరలిపోయాయని విమర్శించారు. 'గవర్నర్ ప్రసంగంలోని ప్రతి వాక్యం పచ్చి అబద్ధం. మోసం. ఇది గవర్నర్‌ను కూడా మోసం చేయడమే. బీసీలను కులగణన లెక్కలు తప్పని ప్రశ్నించిన సొంత పార్టీ ఎమ్మెల్సీని కూడా పార్టీ నుంచి తొలగించారు. కులగణన పేరుతో బీసీలను వంచిస్తున్నారు. మొత్తంగా గవర్నర్ ప్రసంగం పెండ్లిలో చావులో డప్పు కొట్టినట్టు ఉన్నది' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

### పంటలు ఎండితే ఉత్పత్తి పెరిగిందా?

నీళ్లు లేక పంటలు ఎండిపోతే రేవంత్‌రెడ్డి పాలనలో వరి ధాన్యం ఉత్పత్తి పెరిగిందని పచ్చి అబద్ధాలు చెప్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఏడాది పాలన వల్లే రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి జరిగిందా? అని ప్రశ్నించారు. తమ హయాంలో రూ.4.5 లక్షల కోట్లకుపైగా వ్యవసాయానికి ఖర్చు చేశామని, నేడు కాంగ్రెస్ నేతలు వరిసాగు పెరిగిందని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఊర్లలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులను ప్రజలు తన్నితరిమి కొడుతున్నారని చెప్పారు.

# చేవలేక.. చావుభాష

I తరువాయి...

అని కాదు; ఎవరైనా ఏదో ఒక రోజు అంతిమ యాత్రకు, మరు భూమిలో ఆరడుగుల ఆఖరి మజిలీకి సిద్ధపడవలసిందే! ఆలోగా మనం ఏం చేస్తామన్నదే అసలు కథ. మనకున్న సమయంలో మన ఆట మనం ఆడాలే తప్ప, ప్రత్యర్థి మరణాన్ని కోరుకునే రాజకీయాన్ని తెలంగాణ, ఆ మాట కొస్తే తెలుగు రాష్ర్టాల ప్రజలు ఇప్పుడే చూస్తున్నారు. ఆగర్భ శత్రువైనా ఆరోగ్యంగా కలకాలం బతికుండాలని కోరుకునే ధర్మం మనది. మరి రాజకీయ రణం చేయలేక మరణాన్ని కోరుకోవడం ఏ తరహా రాజకీయమో రేవంతే చెప్పాలి. ముఖ్యమంత్రి మాటలతో సభకు వచ్చిన జూనియర్ లెక్చరర్లే కాదు; టీవీల్లో చూస్తున్న ప్రేక్షకులు, సోషల్ మీడియాలో గమనించిన నెటిజన్లు ఒక్కసారిగా విస్తుపోయారు. ఇదేం భాష? ఇదేం వైఖరి? రేవంత్ ఎందుకిలా మాట్లాడుతున్నారు? అని విస్మయ పడ్డారు. కేసీఆర్ అభిమానులు, తెలంగాణ వాదులు, ఉద్యమకారులు ఇదేం పద్ధతంటూ ఆవేశపడ్డారు. ఆవేదన చెందారు? ఇదేం విలువల పతనమని సీనియర్ జర్నలిస్టులు, మేధావులు ఆగ్రహించారు. కొందరైతే... ''అదో పిచ్చి కేసు. మనమేం మాట్లాడుతం, తెలంగాణ ప్రజలను దేవుడే రక్షించాలి'' అంటూ స్పందించారు. చివరికి కాంగ్రెస్ సీనియర్లు కూడా ''మావాడికి ఏమైంది? ఎందుకిట్ల చేస్తున్నడు?'' అని ఆక్రోశించారు. '' స్టేచర్ అనేది వ్యక్తికి ఉండదు. కుర్చీకి ఉంటది అని రేవంత్ చెప్పారు. తాను ముఖ్యమంత్రి అయ్యారుగనక అయనకు ఆ కుర్చీ అపురూపంగా, స్టేచర్ ఫుల్‌గా కనిపిస్తూ ఉండవచ్చు. కానీ ఆయన చెప్పినట్టు స్టేచర్ అనేది కుర్చీకి పొజిషన్‌కు ఉండదు. ఇండివిడ్యువల్‌కే ఉంటది. మహాత్మా గాంధీజీ, రామకృష్ణ పరమహంస, వివేకానంద, అబ్దుల్‌కలాం, మదర్ థెరీసా వీళ్లందరికీ ఏం కుర్చీలున్నాయని, ఏ పొజిషన్‌లు ఉన్నాయని స్టేచర్ వచ్చింది? స్టేచర్ లేని మనుషులు మాత్రమే కుర్చీ స్టేచర్‌ను నమ్ముకుంటరు. ముఖ్యమంత్రి తన అజ్ఞానాన్ని సర్వజ్ఞత్వంగా భావిస్తున్నారు'' అని సీనియర్ పాత్రికేయుడొకరు ఆక్షేపించారు. ''అయినా కేసీఆర్ చేసిన తప్పేముంది? ఆయనేమీ ముఖ్యమంత్రి కుర్చీ కావాలనే ఏకైక లక్ష్యంతో పని చేయలేదు. పదవుల కోసం పార్టీలు మారలేదు. పదవులు వదులుకుని తన ప్రాంతం కోసం పరితపించాడు. తన ప్రజల హక్కుల కోసం ఉద్యమించాడు. ప్రత్యేక రాష్ర్టాన్ని సాధించాడు. దానికొక దశదిశ కల్పించాడు. పదవులకు వన్నె తెచ్చాడు. తెలంగాణలోని సబ్బండ వర్గాలకు తనకు తోచినంత మేలు చేశాడు. ప్రజలు ఎన్నికల్లో ఓడిస్తే.. ముందే చెప్పినట్టు తన పొలానికి పోయి మౌనంగా వ్యవసాయం చేసుకుంటున్నడు. ఇప్పుడు ఆయన్ను తిట్టవలసిన అవసరం ఏమున్నది? ఐదేండ్లలో రేవంత్ తానేం చేయగలడో చేసి నిరూపించుకోవచ్చు కదా! కేసీఆర్ కన్నా ఎక్కువ మంచి పనులు చేసి, ఆయన కన్నా పెద్ద స్టేచర్ తెచ్చుకోవచ్చు కదా! రణం చేయలేక మరణాన్ని కోరుకుంటరా? కారణాలేమిటోగానీ ముఖ్యమంత్రి బ్యాలెన్స్ తప్పుతున్నరు'' అని సామాజిక వేత్త ఒకరు అభిప్రాయపడ్డారు. విశేషం ఏమిటంటే స్టేచర్.. రేవంత్ భాషలో చెప్పాలంటే స్టేచర్ గురించి... కేసీఆర్‌గానీ, ఆ పార్టీ నేతలుగానీ, పార్టీగా బీఆర్ఎస్‌గానీ ఎన్నడూ చర్చకు తేలేదు. ప్రస్తావించలేదు. ముఖ్యమంత్రి స్థాయికి రేవంత్ సరిపోవడం లేదనే చర్చ, రాజకీయ వర్గాల్లో, అందునా కాంగ్రెస్ శ్రేణుల్లోనే ఎక్కువగా జరుగుతున్నది. అత్తమీద కోపం దుత్తమీద చూపినట్టు ఈ చర్చ వల్ల తనకు కలిగిన మనో వైకల్యాన్ని రేవంత్ కేసీఆర్ మీదికి ప్రయోగించడం గమనార్హం. ''రాజు జీవించె రాతి విగ్రహములందు.. సుకవి జీవించె ప్రజల నాలుకల యందు అంటూ జాషువా రాసిన పద్యం ప్రస్తుత సందర్భానికి సరిగ్గా సరిపోతుంది. రేవంత్ ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కాడేమోగానీ, జనానికి మాత్రం అనుక్షణం కేసీఆరే గుర్తుకు వస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రేవంత్ ఇంకా సీఎంగా స్థిరపడలేదు. నిత్యం ఆయనతో కలిసి ఉండే కేబినెట్ సహచరులైన పొన్నం ప్రభాకర్, జూపల్లికే ఆయన ముఖ్యమంత్రిగా గుర్తుకురాలేదు. సినిమా నటులు, నేషనల్ టీవీ యాంకర్ల సంగతి చెప్పనే అక్కర్లేదు. చివరికి హైదరాబాద్‌లో జరిగిన ఒక పెండ్లికి రేవంత్ వెళ్తే కూడా కేసీఆర్ కేసీఆర్ అనే నినాదాలే వినిపించాయి. ఇది ఇబ్బందికరమైన పరిస్థితే, అయితే రేవంత్ తన స్టేచర్‌ను పెంచుకోలేకపోవడం కేసీఆర్ తప్పు కాదు కదా! కేసీఆర్ మీద ఉన్న అసూయ అక్కసుగా మారి బ్యాలెన్స్ తప్పేలా చేస్తున్నట్టుంది'' అని విశ్లేషించాడొక రాజకీయ పరిశీలకుడు. ''రాహుల్ గాంధీ పుట్టుకకు సంబంధించి అసోం ముఖ్యమంత్రి బీజేపీ నేత హేమంత్ బిశ్వశర్మ అనుచిత వ్యాఖ్యలు చేస్తే, రాష్ట్రంలో కాంగ్రెస్ తనకు ప్రధాన ప్రత్యర్థి అని తెలిసినా కేసీఆర్, రాహుల్‌గాంధీ పక్షాన నిలిచారు. హేమంత్ అలా మాట్లాడకూడదని ఖండించారు. అది కేసీఆర్ సంస్కారం. మార్చురీల గురించి మాట్లాడటం రేవంత్ సంస్కారం. ఏం చేస్తాం!'' అని ముక్తాయించారొక బీఆర్ఎస్ నేత!



# గవర్నర్ నోట.. సర్కార్ అబద్ధాలు

మొదటిపేజీ తరువాయి...

వేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం.

- రుణమాఫీ కాలేదని రైతులు గగ్గోలు పెడుతుంటే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్టు గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారు.
- రైతు భరోసా సైతం ఇంకా చాలామంది రైతులకు అందకపోయినా ఇస్తున్నట్టు చెప్పారు. మ్యానిఫెస్టోలో రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రకటించినప్పటికీ, గవర్నర్ ప్రసంగంలో మాత్రం రూ.12 వేలకు పెంచినట్టు పేర్కొనడం గమనార్హం.
- రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేలు సమకూర్చుతున్నట్టు చెప్పారు. ఇది ఇంతవరకు అమలుకు నోచుకోలేదు.
- బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటుచేసిన రైతు వేదికలను తమ ఖాతాలో వేసుకున్నారు. అత్యాధునిక ఆడియో-విజువల్ మీడియా సదుపాయంతో 566 రైతు వేదికలను ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు.
- వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్నది ఎన్నికల హామీ కాగా, ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తున్నట్టు చెప్పారు.
- 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్ సైతం నామమాత్రంగా అమలుచేస్తూ, ప్రభుత్వం సాధించిన ఘనతగా పేర్కొన్నారు.
- సివిల్ సర్వీస్ పరీక్షల ఆశావహులకు రూ.లక్ష చొప్పున అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కానీ ఇది అమలు కావడం లేదు.
- గత ప్రభుత్వం జారీచేసిన ఉద్యోగాలనే భర్తీ చేసి.. ఏడాదిలోనే 55,000 ఉద్యోగాలు కల్పించినట్టు చెప్పుకున్నది.
- 'ఆరోగ్యశ్రీ' కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచినట్టు పేర్కొన్నప్పటికీ, ఇది ఎక్కడా అమలవడం లేదు.
- రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించినట్టు పేర్కొన్నప్పటికీ, సక్రమంగా జరగలేదనే ఆరోపణలున్నాయి.
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు గృహనిర్మాణం, విద్య, ఉపాధి, సామాజిక భద్రత కోసం ఆర్థిక సహాయం అమలుచేస్తున్నట్టు పేర్కొన్నప్పటికీ, ఎంతమంది లబ్ధిపొందారో వివరించలేదు.
- దావోస్ పర్యటనలో రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను ఆకర్షించినట్టు, దీనిద్వారా 49,500 మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న కంపెనీల్లో చాలావరకు బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నవే కావడం గమనార్హం.